క్లుప్తంగా

కాటమరాజుకు దద్దాల నివాళి



కాటమరాజుకు నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ

పీసీపల్లి: మండల పరిధిలోని వేపగుంపల్లి వైఎస్సార్ సీపీ నాయకులు కాటమరాజుకు పార్థివ దేహానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాటమరాజుకు కుటుంబ సభ్యులు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. దద్దల వెంట మండల వైస్సార్ సీపీ పార్టీ కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, జెడ్పీటీసీ ఓకేరెడ్డి, ఎంపీటీసీ కొండారెడ్డి సుదర్శన్, మేకల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ శనివారం ఆదాయం రూ.11,40,170

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండలో వెలసి ఉన్న శ్రీ మాల్యాద్రి ఎల్మీనరసింహస్వామి వారి దేవస్థానం ఆదాయం శనివారం రూ.11,40,170 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.బి శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.30,520, తలనీలాలు రూ.57,750, ప్రత్యేక దర్శనం రూ.3,61,100, లడ్డూ ప్రసాదాలు రూ.2,15,735, అన్నదానం రూ.4,17,425, రూం అద్దెలు రూ.30,120 కలిపి రూ.11,40,170 వచ్చినట్లు తెలిపారు. ఆలయ అధికారులు పర్యవేక్షణలో జరిగింది.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

గుడ్లూరు: ఆగిఉన్న బొలెరో వాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీ కొట్టడంతో బొలెరో వాహన డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని జాతీయ రహదారిపై మోచర్ల వద్ద శనివారం జరిగింది. విజయవాడ నుంచి నెల్లూరుకు వెళుతున్న లారీ మోచర్ల వద్దకు వచ్చే సరికి రహదారి పక్కన నిలిపి ఉన్న బొలెరో వాహనాన్ని వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో ఆ వాహనం ముందుకు వెళ్ళి చెట్లను ఢీ కొంది. వాహనంలో ఉన్న డ్రైవర్‌కు గాయాలయ్యాయి. అతనిని 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాద స్థలిని పోలీసులు పరిశీలించారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

గుడ్లూరు: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. మండంలోని దప్పలంపాడు గ్రామం వద్ద ఉన్న మన్నేరు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న ఎస్సై లక్ష్మణరావు తన సిబ్బందితో కలిసి దాడి చేసి మూడు ట్రాక్టర్లును స్వాధీనం చేసుకొని డ్రైవర్లను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి



ముప్పళ్లపాడులో రైతు సంఘ నాయకులు

హనుమంతునిపాడు: రైతు వ్యతిరేక విధానాలపై ప్రతి రైతు ఉద్యమించాలని డివిజన్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి అన్నారు. శనివారం ముప్పళ్లపాడులో ఏరువాక పౌర్ణమి రైతు మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలన్నారు. రైతు పండించిన పంటలకు కనీస మద్దతు ధరల కోసం పార్లమెంట్‌లో చట్టం అమలు చేయాలన్నారు. రైతుకు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. రైతుకు ట్రాక్టర్లు, డీజిల్ 50 శాతం రాయితీపై కల్పించాలన్నారు. రమణయ్య, సిద్దయ్య, సుబ్బారావు, బ్రహ్మయ్య, శ్రీను, బాలిరెడ్డి, జి.పి. రామారావు, ఖాశిం, కళ్యాణ్ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి ఘటనలో కేసు నమోదు

సీఎస్‌పురం (పామూరు): వ్యక్తిపై దాడిఘటనలో ఐదు మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. మండలంలోని ముళ్లపాడు గ్రామానికి చెందిన గజ్జల కోటిరెడ్డి శుక్రవారం రాత్రి 10.40 గంటల సమయంలో వాటర్‌ప్లాంట్ వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా బజారులో కుక్కలు మొరిగాయి. దీంతో కోటిరెడ్డి కుక్కలపైకి రాయి విసిరాడు. రాయి సమీపంలోని ఇంటి మీదకు పోయింది దీంతో అక్కడ ఉన్న గుడిపాటి లక్ష్మమ్మ, గుడిపాటి రామిరెడ్డి, గుడిపాటి గోవిందమ్మ, గుడిపాటి లక్ష్మయ్య, ఆశం సుజాతలు తనపై దాడి చేశారని గోటిరెడ్డి శనివారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోటిరెడ్డి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడ్డవారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘నేను బడికి పోతా’ విజయవంతం చేయండి



కరేడులో నేను బడికివస్తా కార్యక్రమం నిర్వహిస్తున్న డిప్యూటీ ఈఓ



హెచ్‌ఎంల సమీక్షలో మాట్లాడుతున్న ఎంఈఓ పెద్ది రాజు

వెలిగండ్ల: అన్ని పాఠశాలల పరిధిలో జూలై 12 వరకు ‘నేను బడికి పోతా’కార్యక్రమాన్ని చేపట్టాలని ఎంఈఓ-1 దాసుప్రసాద్, ఎంఈఓ -2 దేవిరెడ్డి రామిరెడ్డిలు అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో ప్రధానోపాధ్యాయుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ 5 ఏళ్లు నిండిన పిల్లలందరినీ, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను 6 వ తరగతిలో చేర్పించాలన్నారు. 8వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను 9వ తరగతిలో చేర్పించాలన్నారు. 100 శాతం విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులదేనన్నారు. కేజీబీవీ ప్రత్యేకాధికారి ఎస్. సుశీల, హెచ్‌ఎంలు రాఘవాచారి, ఓ. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

హనుమంతునిపాడు: బడి బయట ఉన్న పిల్లలు నూరు శాతం స్కూళ్లలో ఉండేలా చూడాల్సిన బాధ్యత పాఠశాలల హెచ్‌ఎంలపై ఉందని ఎంఈఓ జి.పెద్దిరాజు, తహసీల్దార్ కిషోర్‌రెడ్డి, ఎంపీడీఓ కె.లలిత అన్నారు. శనివారం ఎమ్మార్సీ కార్యాలయంలోవారు మాట్లాడుతూ ‘నేను బడికి పోతా’ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.లలిత, తహసీల్దార్ కిషోర్‌రెడ్డి, ఎంఈఓలు ఎస్.రమణయ్య, ఏపీఎం నారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

ఉలవపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి వారిని బడికి పంపించాలని కందుకూరు డిప్యూటీ ఈఓ ప్రసాదరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని కరేడు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల పరిసర ప్రాంతాల్లో నేను బడికి వస్తా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలను చైతన్య పరచి బడికి రాని విద్యార్థులను బడికి వచ్చేలా చేయడం, బడి మానేసిన వారిని మరలా బడిలో చేర్పించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు ఉన్నాయని, విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బంది ఉండదని, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందుతుందని తెలిపారు. విద్యా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి ప్రభుత్వ పాఠశాలలో చేరాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ రమణయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: నేను బడికి పోతా కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నేను బడికి పోతా కార్యక్రమం పై అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రకాశం మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందర్నీ బడిలో చేర్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ అధికారులు, అంగన్‌వాడీ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, గ్రామాల్లో విధిగా సర్వేలు నిర్వహించి, విద్యార్థులను పాఠశాలల్లో నమోదు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రాంతాల్లో ఎక్కువ మంది విద్యార్థులు నమోదు అయ్యే విధంగా చూడాలన్నారు. ఎంఈఓలు డీవీ సుబ్బారావు, యువీ నారాయణరెడ్డి, ఈఓ ఆర్‌డీ అన్నమ్మ, మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ‘నేను బడికి పోతా’ కార్యక్రమం ర్యాలీ నిర్వహించారు.



వెలిగండ్లలో మాట్లాడుతున్న ఎంఈఓ దాసుప్రసాద్



ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ, ఎంఈఓలు

మృతులకు దద్దాల నారాయణ నివాళి



దేవకి సురేష్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ యాదవ్, బన్నీ, గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని 14వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ దేవకి సత్యావతి పెద్ద కుమారుడు దేవకి సురేష్ (32) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. సురేష్ భౌతికకాయాన్ని శనివారం వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, ఓకే రెడ్డి, వైస్ చైర్మన్‌లు పులిశాంతి గోవర్ధన్ రెడ్డి, ఆర్. మాణిక్యరావు సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు లతో పాటు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకుల రెడ్డి, గోపవరపు బొర్రారెడ్డి, సూరసాని మోహన్ రెడ్డి, చింతం శ్రీను, డాక్టర్ రసూల్, పట్టణ ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. అలాగే పార్టీ వాణిజ్య విభాగం పట్టణ నాయకుడు తడికమళ్ల వెంకటేశ్వర్లు తల్లి విజయలక్ష్మి (80) మృతి చెందారు. ఆమె భౌతిక కాయాన్ని కూడా శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు సందర్శించి పూల మాలల వేసి నివాళులర్పించారు.

పార్టీ కార్యాలయాన్ని కూల్చివేయడం దుర్మార్గం



మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్

● దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని అక్రమంగా కూల్చి వేయడం దుర్మార్గమైన చర్య అని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం చట్ట వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని తీవ్రంగా మండిపడ్డారు. తాడేపల్లిలో దాదాపు పూర్తి కావచ్చిన వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయాన్ని ఉద్దేశ పూర్వకంగా కూల్చి వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ సీపీ కార్యాలయానికి సరైన అనుమతులు ఉన్నా.. కావాలనే కక్ష పూరితంగా కూల్చి వేతకు పాల్పడ్డారని ఘాటుగా విమర్శించారు. చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఇది నిదర్శనమన్నారు. చంద్రబాబు ఒక నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, జి. ఆదినారాయణరెడ్డి, కటికల వెంకట రత్నం, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా కిట్లు వినియోగించుకోండి



సీతారాంపురం ఉన్నత పాఠశాలలో కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ, హెచ్‌ఎం



సీఎస్‌పురంలో కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎంఈవో, సర్పంచ్, నాయకులు

హనుమంతునిపాడు: ప్రభుత్వ అందిస్తున్న విద్యాకిట్లను విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని హెచ్‌ఎం పద్మావతి, ఎంపీటీసీ కె.శోభ అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థులకు విద్యాకిట్ల పంపిణీ అనంతరం సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డితో కలిసి మాట్లాడారు. విద్యార్థులకు బ్యాగ్స్, నోట్ బుక్స్ ,టెక్టు పుస్తకాలున్న కిట్లను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన తోపాటు మంచి భోజనం , దుస్తులు, విద్యాకిట్లు అందిస్తోందన్నారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఎస్. వెంకటేశ్వరెడ్డి, సర్పంచ్, సానికొమ్ము బ్రహ్మారెడ్డి, గ్రామస్తులు వెంకటసుబ్బయ్య, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వరం

సీఎస్‌పురం (పామూరు): ప్రభుత్వం పాఠశాలల్లోని విద్యార్థులకు అందిస్తున్న స్టూడెంట్ కిట్స్ వారికి వరం లాంటివని మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి, సర్పంచ్ శ్రీరాం పద్మావతి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల హెచ్‌ఎం షేక్ ఖాదరున్నీసా బేగం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగం బలోపేతానికి, పేద విద్యార్థులు సైతం ఉన్నత చదువులు చదివేందుకు కోట్లు ఖర్చుచేస్తున్నాయని విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత లక్ష్యం దిశగా ముందుకు పోవాలన్నారు. కార్యక్రమంలో మన్నేపల్లి పెద్దన్న , బొబ్బూరి రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై తహసీల్దార్ విచారణ



విచారణ చేస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

కొండపి(సింగరాయకొండ): పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్‌లో వచ్చిన భూ ఆక్రమణ ఫిర్యాదుపై శనివారం కొండపి రెవెన్యూ కార్యాలయంలో విచారణ చేపట్టినట్లు తహసీల్దార్ బి.కిరణ్ కుమార్ తెలిపారు. పెట్లూరులోని సర్వే నంబర్ 450లో ఉన్న తమ భూమిని కొందరు ఆక్రమించి ఇళ్లు నిర్మించుకుంటున్నారని కల్లూరి చెంచురామయ్య, శ్రీనివాసరావు, హరిబాబు తదితరులు కలెక్టర్‌కు పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆ భూమికి సంబంధించి ఇరు వర్గాలకు నోటీసులు జారీ చేసి విచారణకు పిలిపించినట్లు చెప్పారు. ఇరువర్గాల వద్ద ఉన్న పత్రాలు తీసుకుని, స్టేట్‌మెంట్ రికార్డ్ చేశామని తెలిపారు. కాగా ఆ భూమికి సంబంధించి హైకోర్టు, కందుకూరు కోర్ట్‌లో ఆర్డర్ పెండింగ్‌లో ఉన్నట్లు ఫిర్యాదుదారులు తెలిపారు. విచారణలో సంబంధిత పత్రాలను కూడా సమర్పించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.336



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న సునీల్ కుమార్



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

కొండపి(సింగరాయకొండ): కొండపి వేలం కేంద్రంలో శనివారం పొగాకు గరిష్ట ధర కేజీ రూ.336 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. బోర్డ్ పరిధిలోని ఎస్.ఎస్.కంద్రిక, పెట్లూరు, వర్ధినేనివారిపాలెం, జగ్గరాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1,185 బేళ్లు వేలానికి తీసుకురాగా 1127 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 58 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.336, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.306.04 పలికింది. వేలంలో 31 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులపై అవగాహన

స్థానిక పొగాకు వేలం కేంద్రంలో రైతులకు వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ పచ్చిరొట్ట ఎరువులపై అవగాహన కల్పించారు. రైతులకు అవసరమైన పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోర్డ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పొగాకు అత్యధిక ధర కేజీ రూ.337

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శనివారం నిర్వహించిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ.337 పలికింది. జమ్ములపాలెం, తూమాడు గ్రామాల రైతులు 901 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 869 కొనుగోలయ్యాయి. వ్యాపారులు 32 బేళ్లను తిరస్కరించారు. కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.278.20 పలికింది. వేలంలో మొత్తం 41 మంది వ్యాపారులు పాల్గొన్నారు. ఇప్పటి వరకు 62,202 పొగాకు బేళ్లు కొనుగోలయ్యాయని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

సామాజిక తనిఖీ పక్కాగా నిర్వహించాలి


● జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి



మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి

సింగరాయకొండ: మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం కింద 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్‌ను సక్రమంగా చేపట్టేందుకు సామాజిక తనిఖీ బృందానికి సిబ్బంది సహకరించాలని జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి స్పష్టం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సోషల్ ఆడిట్‌పై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఎంపీడీఓ టి.నాగేష్‌కుమారి మాట్లాడుతూ.. గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన వివరాలను సామాజిక తనిఖీ బృందానికి సక్రమంగా అందజేసి, వారికి సహకరించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో సభ నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏపీఓ సీహెచ్ సుధాకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి చిన్నారి చదువుకోవాలి



జరుగుమల్లిలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

జరుగుమల్లి(సింగరాయకొండ): ప్రతి చిన్నారి బడిలో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ జలజాక్షి పేర్కొన్నారు. జరుగుమల్లి మండల కేంద్రంలో శనివారం నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు చదువు ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి చిన్నారి బడిలో చదువుకోవాలే తప్ప చిన్న వయసులోనే దుకాణాల్లో పనిచేయకూడదన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎంపీడీఓ కార్యాలయం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి,విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. ఎంఈఓ బి.నాగేంద్రవదన్, డి.శ్రీనివాసరావు,ప్రధానోపాధ్యాయుడుమద్రిబోయిన శ్రీనివాసరావు,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు



సింగరాయకొండ: ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి



సింగరాయకొండ: బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులు

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ పోలేరమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు శనివారం రెండో రోజు అత్యంత కన్నుల పండుగగా జరుగుతున్నాయి. పోలేరమ్మ తల్లిని దర్శించుకుని భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆదివారం చివరిరోజు పోలేరమ్మ తల్లికి పాలపొంగళ్లు భక్తులు సమర్పిస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి శివశంకర్ తెలిపారు. భక్తులు భారీగా తరలి వస్తున్నారని ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

మాదిగల ఆత్మగౌరవ కవాతు జయప్రదం చేయండి



పందలపాడులో సన్నాహక కవాతు నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కందుకూరు: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ చేపట్టిన ఉద్యమం 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జూలై 7వ తేదీన వరంగల్‌లో జరిగే మాదిగల ఆత్మగౌరవ మహా కవాతును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు వర్ల దేవదాసు మాదిగ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం మండలంలోని పందలపాడు గ్రామంలో సన్నాహక కవాతును నిర్వహించారు. 30 సంవత్సరాల ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ పోరాటం మాదిగలకు ఆత్మగౌరవాన్ని సంపాదించడంతోపాటు, సమాజానికి మేలు చేసిందన్నారు. గుండెజబ్బు పిల్లలు, వికలాంగులు, వృద్ధులు వితంతువుల కోసం ఎమ్మార్పీఎస్ అనేక పోరాటాలు చేసిందన్నారు. మందకృష్ణ ఆదేశాల మేరకు ప్రపంచం నివ్వెరపోయేలా వరంగల్‌లో లక్షలాది మంది మాదిగలతో మాదిగ ఆత్మగౌరవ మహాకవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీని కోసం ప్రతి విద్యార్థి, యువకుడు తప్పనిసరిగా తెల్ల షర్టు, తెల్ల ప్యాంట్ వేసుకుని కవాతుకు సిద్ధమై తరలిరావాలన్నారు. అన్ని గ్రామాల్లో 6వ తేదీ జెండా ఆవిష్కరణ జరుపుకుని, 7వ తేదీ వరంగల్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ జి.కాంతారావుమాది, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు రాజేష్, నరేష్, కిశోర్, మహేంద్ర, విల్సన్, బాలయ్య, కిరణ్, రూబెన్, పేతురు, రాజాచింటు, జోహర్స్, జస్వంత్ పాల్గొన్నారు.

సేవ చేయడమే వాసవి క్లబ్ లక్ష్యం



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు



చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, గొడుగులు అందజేస్తున్న దృశ్యం

సింగరాయకొండ: పేదలకు సేవ చేయడమే వాసవి క్లబ్స్ ప్రధాన ఉద్దేశమని డాన్ టు డస్క్ ప్రోగ్రాం ఇన్‌చార్జి అధికారి క్లబ్ వీఎస్ కేసీజీఎఫ్ బొమ్మిశెట్టి లక్ష్మీకుమారి పేర్కొన్నారు. మండల వాసవీ, వనితా, యూత్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన డాన్ టు డస్క్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. క్లబ్ ద్వారా పేద ఆర్యవైశ్యులకు వ్యాపారాభివృద్ధికి ఆర్థిక సహకారం అందిస్తామని, చనిపోయిన క్లబ్ సభ్యులకు ఇన్సూరెన్స్ సదుపాయం కలగజేస్తున్నామన్నారు. డాన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు మాస్కులు, టవల్స్, చిరు వ్యాపారులకు తోపుడుబండ్లు, గొడుగులు అందజేశారు. చెట్టుమహాలక్ష్మమ్మ దేవస్థానానికి ప్లాస్టిక్ బల్లలు బహూకరించారు. క్లబ్ సభ్యులు అవయవదానానికి అంగీకార పత్రాలు అందజేశారు. వనితా క్లబ్ అధ్యక్షురాలు యేల్చూరి భవాని, సెక్రటరీ కొత్తమాసు ఉదయలక్ష్మి, ట్రెజరర్ శ్రీరాం సుశీల, వాసవీ క్లబ్ అధ్యక్షుడు బచ్చు కోటేశ్వరరావు, యూత్ క్లబ్ అధ్యక్షురాలు పబ్బిశెట్టి దీపిక, సుస్మిత, ఆర్‌సి కోటరాము, త్రీస్టార్ కేసీజీఎఫ్ చుండూరి సురేష్, జిల్లా ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పబ్బిశెట్టి శ్రీను, జిల్లా మురళి పాల్గొన్నారు.